బాధిత కుటుంబానికి బీమా చెక్కు

బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఆర్ఎం రితేశ్ కుమార్ గుప్తా

సిర్పూర్(టీ), జూలై 26 : ప్రతి ఒక్క ఖాతాదారుడూ ప్రమాద బీమా చేసుకోవాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రితేశ్ కుమార్ గుప్తా సూచించారు. మండల కేంద్రానికి చెందిన దాగం భీమయ్య ఇటీవల రైలు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన ఇంతకుముందే సిర్పూర్(టీ) శాఖ బ్యాంక్‌లో ప్రమాదబీమా చేసుకున్నాడు. కాగా, మంజూరైన రూ.20లక్షల చెక్కును శుక్రవారం బాధిత కుటుంబానికి రీజినల్ మేనేజర్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ సిర్పూర్(టీ) బ్రాంచ్ మెనేజర్ నూతన్ రెడ్డి, ఫీల్డ్ అధికారి భాషా, క్యాషియర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేలో మొదటి స్థానంలో నిలుపాలి

నస్పూర్, జూలై 26 : కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపాలని డీఈవో యాదయ్య పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల సబ్జెక్టు డీఆర్పీలకు జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులందరూ అభ్యాసన ఫలితాలు సాధించేలా బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు సత్యనారాయణమూర్తి, చౌదరి శ్రీనివాస్, డీఆర్పీలు పాల్గొన్నారు.

జిల్లాకు రెండో విడుత యూనిఫాం వస్త్రం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే ఏకరూప దుస్తుల రెండో జత యూనిఫాం వస్త్రం ట్రిస్కో నుంచి 96,759 మీటర్లు మంచిర్యాల జిల్లాకు చేరిందని డీఈవో తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయుల ద్వారా డీఆర్డీఏ, మెప్మా సమన్వయంతో సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీలోగా విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు.

పాఠశాలల తనిఖీ..

హాజీపూర్, జూలై 26 : మండలంలోని దొనబండ, నర్సింగాపూర్, కోత్తగూడ ప్రభుత్వ పాఠశాలలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల రిజిస్టర్, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. మౌలిక సదుపాయాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్

మంచిర్యాల అర్బన్, జూలై 26 : మంచిర్యాల పట్టణ ఆటో ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్‌రోడ్డులో గల బీఎంఎ ఫంక్షన్ హాల్‌లో జిల్లా గౌరవాధ్యక్షుడు బెల్లంకొండ మురళి, సభాధ్యక్షుడు చెల్ల విక్రమ్ పర్యవేక్షణలో గౌరవాధ్యక్షుడిగా రాజేశ్, అధ్యక్షుడిగా కల్వల అంజయ్య, ముఖ్య సలహాదారులుగా నూనె భిక్షపతి, ఎండీ రియాజ్ అషు, న్యాయ సలహాదారులుగా అడ్వకేట్ కేవీ ప్రతాప్, కార్య నిర్వాహణ అధ్యక్షుడిగా బోరే వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా పీ క్రాంతి, కోశాధికారిగా ఎండీ షఫీ, ఉపాధ్యక్షులుగా నాయిని వెంకటేశ్, శ్రీనివాస్, హైమద్, సీహెచ్ రవి, కార్యదర్శులుగా ఎండీ కలీం, ప్రభాకర్, సంయుక్త కార్యదర్శులుగా ఖండి కమలాకర్, మల్లేశ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు పొట్ట మధూకర్, చల్ల విక్రం, కట్ట రామ్‌కుమార్, ఆవుల సుధాకర్, మిర్యాల గట్టయ్య, మొయ్య రాంబాబు, నేరెళ్ల వెంకటేశ్, తుమ్మల గోపాల్ రెడ్డి, ఎండీ హబీబ్ బాబా, శ్రీనివాస్, ప్రకాశ్, సతీశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

వాంకిడి, జూలై 26 : కలెక్టరేట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రియాజ్ అలీ వాంకిడి తహసీల్దార్‌గా.. మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా నజ్రుల్లా ఖాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన వీవీ వరలక్ష్మి బదిలీపై కరీంనగర్ జిల్లా మానకొండూర్‌కు బదిలీపై వెళ్లగా, పెంచికల్‌పేట్ మండల సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న నజ్రుల్లా ఖాన్ బదిలీపై వాంకిడి ఎంపీడీవోగా వచ్చారు.

ఎన్ఏఎస్‌లో రాణించాలి

ఆసిఫాబాద్ టౌన్, జూలై 26 : నేషనల్ అచీవ్ మెంట్ సర్వే(ఎన్ఏఎస్)లో జిల్లా విద్యార్థులు రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయి ఎన్ఏఎస్ సర్వే శిక్షణ కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులందరూ కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేలా ప్రతీ ఉపాధ్యాయుడు విద్యా బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాథోడ్ సుభాష్ , జిల్లా రిసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ద బెస్ట్ ఇండియా

భారత క్రీడాకారులకు విషెష్ తెలుపుతున్న గిరిజన క్రీడాకారులు

ఆసిఫాబాద్ టౌన్, జూలై 26 : నేటి నుంచి ప్యారీస్‌లో ఒలింపిక్స్‌లో దేశం నుంచి పాల్గొననున్న 117 మంది క్రీడాకారులకు స్థానిక గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థినులు ఇండియన్ ఫ్లాగ్స్‌తో చీర్ ఫర్ ఇండియా నినాదంతో అల్ ది బెస్ట్ అంటూ క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ ఆర్ రమాదేవి మాట్లాడుతూ భవిష్యత్‌లో జిల్లాలోని గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థినులు కూడా ఒలింపిక్‌లో పాల్గొని సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఏసీఎంవో ఉద్దవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, క్రీడల అధికారి బండ మీనారెడ్డి, సీనియర్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్ కృష్ణారావు, క్రీడా పాఠశాల కోచ్ విద్యాసాగర్, క్రీడా పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఉరుస్తున్న డిగ్రీ కళాశాల భవనం

తరగతి గదిలో చేరిన నీరు

నస్పూర్, జూలై 26 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల.. వర్షానికి ఉరుస్తున్నది. గదుల్లోకి నీరు చేరుతున్నది. ఈ కళాశాల 1978లో నిర్మించగా, ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నది. ఇక్కడ అన్ని రకాల వసతులు ఉండడంతో ఎక్కువ మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గదుల్లోని బెంచీలు, ఫర్నిచర్ తడస్తున్నాయి. కొన్ని రూముల్లో స్లాబ్ పెచ్చులూడిపడుతున్నాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ చక్రపాణిని వివరణ కోరగా, ఈ విషయంపై ఇటీవలే ఉన్నతాధికారులకు తెలియజేశామని, త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారని వివరించారు.

విద్యార్థికి అభినందనలు

రెబ్బెన, జూలై 26 : మండలంలోని గోలేటి గ్రామానికి చెందిన విద్యార్థి అవినాష్ చెస్‌లో ప్రతిభ చూపగా, కుమార్ బ్రదర్స్ చెస్ అకాడమీ గౌరవ సలహాదారు రాజ్‌కుమార్ అభినందించారు. తమ అకాడమీలో అవినాష్ కొంత కాలంగా శిక్షణ తీసుకున్నాడని, అండర్-13 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడని పేర్కొన్నారు.

దహెగాం : మోట్లగూడ వరకు చేరిన ప్రాణహిత బ్యాక్‌వాటర్

పెంచికల్‌పేట్ : జైహింద్‌పూర్ వాగు నుంచి వెళ్తున్న విద్యార్థులు

దండేపల్లి : గూడెం వద్ద గోదావరి ఉధృతి

వదలని ముసురు

- ఉప్పొంగిన ప్రాణహిత, పెన్‌గంగ, గోదావరి
- పరీవాహక ప్రాంతాలకు వరద
- నీటమునిగిన పంటలు
- కాగజ్‌నగర్‌లో ఇంటిగోడ కూలి మహిళ మృతి.., బెల్లంపల్లిలో నెల రోజుల పాపకు గాయాలు

దహెగాం/సిర్పూర్(టీ)/పెంచికల్‌పేట్/దండేపల్లి/కాగజ్‌నగర్/బెల్లంపల్లి/కౌటాల/వేమనపల్లి, జూలై 26 : జిల్లాలో పది రోజులుగా ముసురుపట్టింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. ప్రాణహిత, పెన్‌గంగా, గోదావరి, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దహెగాం మండలం మోట్లగూడ, రాంపూర్, దిగిడా తదితర గ్రామాల సమీపానికి ప్రాణహిత బ్యాక్ వాటర్ చేరుతున్నది. పరీవాహక ప్రాంత పంట చేలు నీటమునిగాయి. సిర్పూర్(టీ) మండలం మీదుగా పెన్‌గంగా ఉప్పొంగి ప్రవహిస్తున్నది. మండలంలోని వెంకట్రావ్‌పేట్ వద్ద అంతర్రాష్ట్ర వంతెనను తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెంచికల్‌పేట్‌లో ప్రాణహిత, పెద్ద వాగు, ఉచ్చమల్లి వాగు, బొక్కి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గురువారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని మోర్లి గూడ, జిల్లెడ, నంది గాం గ్రామాలకు ప్రాణహిత బ్యాక్ వాటర్ చేరుతున్నది. పరీవాహక ప్రాంత పంట చేలు నీటమునిగాయి. మరో రెండు రోజులు వర్షం కురిస్తే గ్రామాలకు పూర్తిస్థాయిలో నీరు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు భయాందోళకు గురవుతున్నారు. కొండపల్లి-జైహింద్‌పూర్ గ్రామాల మధ్య ఓర్రెపై నిర్మించిన కల్వర్టు, మట్టి కోతకు గురైంది. పైపులు బయటపడ్డాయి. పైపుల మధ్య గుంతలు ఏర్పడ్డాయి. జైహింత్‌పూర్ పాఠశాల ముందు పెద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కాగా, విద్యార్థులు ఒకరిచేయి ఒకరు పట్టుకొని వాగు దాటుతున్నారు. అయితే వంతెన నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దండేపల్లి మండలం గూడెం వద్ద గోదావరి నీటి మట్టం పెరిగింది. కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పరవళ్లు తొక్కుతున్నది. స్నానానికి వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మండలంలోని వాగులు, వంకలు నీటితో నిండిపోయాయి. కాగజ్‌నగర్ పట్టణంలోని సరోసిల్క్ గంగారాం బస్తీకు చెందిన తాండ్ర కొమురమ్మ (58) ఇంటి గోడ కూలీ మీదపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వర్షానికి తడవడంతో ఒక్కసారిగా మొత్తం ఆమెపైనే పడింది. పోలీసులు అక్కడికి వచ్చి, విచారణ చేపట్టారు. బెల్లంపల్లి పట్టణంలోని 22వ వార్డులో శుక్రవారం తెల్లవారుజామున ఆంధోని దాసు ఇంటి గది పై కప్పు కూలిపోగా, నెల రోజుల పాపకు గాయాలయ్యాయి. మంచిర్యాలలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. వార్డు కౌన్సిలర్ గడ్డం అశోక్‌గౌడ్ మున్సిపల్, రెవెన్యూ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆర్ఐ ఆదిలక్ష్మి, మున్సిపల్ సిబ్బంది రాజశేఖర్, కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అలాగే 28వ వార్డుకు చెందిన వృద్ధురాలు ఖమ్మం భూదేవి ఇల్లు కూలిపోయింది. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆదుకోవాలని వేడుకున్నది. కౌటాల మండలం మొగడ్‌ధగడ్‌లో వృద్ధురాలు లోహట్ జనాబాయి ఇంటి గోడ కూలింది. ఎస్ఐ మధూకర్ 25 కిలోల బియ్యంతో పాటు, ఆర్థిక సాయం అందించారు. వేమనపల్లి మండలంలోని వేమనపల్లి-సుంపుటం మధ్య రహదారి ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో మునిగిపోయింది. కాగా, మండల ప్రత్యేకాధికారి ఉదయ్‌కుమార్ పరిశీలించారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల పనులను, అనంతరం నీల్వాయి కేజీబీవీని పరిశీలించారు. నీల్వాయిలోని మామడ వాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోగా, ఆ ప్రాంతాన్ని, అనంతరం వేమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఫర్టిలైజర్, రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

'దిందా'కు దిక్కేది?

- వానొస్తే ఊరంతా భయం భయం
- రోజుల తరబడి పాలిమెర దాటని జనం
- పల్లె ముఖం చూడని అధికార యంత్రాంగం

ఇటీవల కలెక్టర్‌కు రాసిన లేఖతో గ్రామస్తులు

ఉధృతంగా ప్రవహిస్తున్న దిందా-కేతిని వాగు

చింతలమానేపల్లి, జూలై 26 : వానాకాలం కష్టాలకు కేరాఫ్ అడ్రస్ చింతలమానేపల్లి మండలం దిందా గ్రామం. దట్టమైన అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండడం.., ఓ వైపు ప్రాణహిత.., రెండు వైపులా వాగు.. వర్షం పడిందంటే వరద ఉధృతితో ద్వీపంలా మారే పరిస్థితి. కాలం మొదలైతే పదిరోజులైనా పొలిమేర దాటని దుస్థితి. వాగు దాటరాకపోవడం 3 వేల మంది ప్రజలకు శాపంగా మారింది. ప్రస్తుత వర్షాలకు వారం నుంచి భాహ్య ప్రపంచానికి సంబంధాలు తెగిపోయాయి. అత్యవసరం, అనారోగ్యం వస్తే స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ తప్పా వేరే మార్గం లేదు. వాగు దాటితేనే ఈ గ్రామస్తులకు అన్ని రకాల సౌకర్యాలు అందుతాయి. ఇంతకుముందు నాటు పడవల సాయంతో వాగు దాటేవారు. కానీ, పోలీసులు, అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా పడవలు నడువకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో వీరి పరిస్థితి దారుణంగా తయారైంది. ముందు జాగ్రత్త సరే, మా పరిస్థితి గురించి ఆలోచించరా..? అని గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రజల కోసం పనిచేయాల్సిన ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ గ్రామం విషయంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. హైలేవల్ బ్రిడ్జి మంజూరైనా నిర్మాణం చేయడం లేదంటూ గత వానాకాలం గ్రామస్తులు, యువకులు గ్రామం నుంచి సుమారు 65 కిలోమీటర్లు పాదయాత్ర చేసి, కలెక్టర్‌కు తమ గోడు వెల్లబోసుకున్నారు. అయినా స్పందన రాలేదు. దీంతో రిలే నిరాహార దీక్షలు చేశారు. ఇటీవల తమ కష్టాన్ని మరోసారి తెలియజెప్పేలా బయటికి రాలేని పరిస్థితుల్లో కలెక్టర్‌కు లేఖ కూడా రాశారు. అయినా కూడా ఏ ఒక్క ఉన్నతాధికారి నుంచీ కనీస స్పందన లేదు. ఇక తమ పరిస్థితి ఇంతేనా అని నిర్వేదంలో ఉన్నారు.

మొదటి కాన్పు కోసం వచ్చి ఇక్కడే చిక్కుకున్న..

నేను ఎనిమిది నెలల గర్భవతిని. ఇది నా మొదటి కాన్పు. సంతోషంగా మా అత్తగారింటి నుంచి పుట్టింటికి వచ్చి చిక్కుకున్న. వారం రోజులు ఐతంది వాగు వచ్చి. బయటకు వెళ్లలేని పరిస్థితి. వాగు తీస్తే దవాఖానకు పోదామని చూస్తున్న. నా లెక్క ఇంకా 9 మంది గర్భిణులు ఊళ్లె ఉన్నరు. ఇద్దరు కాన్పు కోసం వెళ్లారు. మా అందరికీ అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలే దిక్కు. ఎప్పుడు ఏమైతదోనని భయమేస్తుంది. దేవుని పైనే భారమేసి ఉంటున్నం.

- దుర్గం శోభ, గర్భిణి, దిందా

కొడుకు హత్యకు కుట్ర

- తాగిన మైకంలో ఓ కొడుకును చంపబోయి మరో కొడుకుపై తల్లిదండ్రుల దాడి

నెన్నెల, జూలై 26 : తాగిన మైకంలో డబ్బుకోసం కన్నకొడుకును హత్య చేసేందుకు యత్నించిన తల్లిదండ్రులు.. ఒక కొడుకును చొంపబోయి మరో కొడుకుపై దాడిచేశారు. ఈ ఘటన నెన్నెల మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పోచమ్మ వాడకు చెందిన అబ్బర్ల విజయ్-పద్మకు ఇద్దరు కొడుకులు (పెద్ద కొడుకు శేఖర్, చిన్నకొడుకు అశోక్). కూలీ పను లు చేసుకుంటున్నారు. వచ్చిన డబ్బుతో నిత్యం మద్యం తాగి గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం విజయ్-పద్మ మద్యం తాగారు. చిన్నకొడుకు అశోక్ కూడా అతిగా తాగి వచ్చాడు. ఈ క్రమంలో ముగ్గురూ డబ్బు విషయమై గొడవపడ్డారు. అశోక్‌ను చంపుతామని బెదిరించారు. పెద్ద కొడుకు శేఖర్ ఇరువురినీ సముదాయించాడు. దీంతో శేఖర్‌ను కూడా చంపుతామని బెదిరించారు. రాత్రి అందరూ పడుకున్నాక అశోక్‌ను చంపాలని తల్లిదండ్రులు నిర్ణయించుకున్నారు. తాగిన మైకంలో నిద్రలో ఉన్న పెద్ద కొడుకు శేఖర్‌పై కొడవలితో దాడిచేశారు. తేరుకున్న కొడుకు అరవడంతో ఎడమ చేయి మణికట్టుపై గాయాలు చేసి, పారిపోయారు. శేఖర్ రక్తపు మడుగులోనే పడిపోయాడు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్తున్న తన పెద్దనాన్న రాజం గమనించి, చుట్టుపక్కలవారిని పిలిచాడు. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి, శేఖర్‌ను దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రైబల్ డిక్లరేషన్ అమలు చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, జూలై 26 : ట్రైబల్ డిక్లరేషన్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఎస్టీ మోర్చా జిల్లా నాయకులతో కలిసి అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ నిరసన చేపట్టారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తున్నా ట్రైబల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై బీజేపీ ఎస్టీ మోర్చా తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాద్రే విశాల్, బీ జేపీ ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం సుభాష్, జిల్లా కార్యదర్శులు కోట్నాక రామ్ షావ్, పెందూర్ మారుతి, నాయకులు శ్రావణ్ గౌడ్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ఫారెస్ట్ చెక్‌పోస్ట్ సందర్శన

వాంకిడి, జూలై 26 : మండల కేంద్రంలోని అంతర్రాష్ట్ర ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌ను శుక్రవారం తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ దూలపల్లి 35వ బ్యాచ్ ట్రైనర్లతో కలసి తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ ఎసీడీ రామ్మోహన్ రావు సందర్శించారు. ట్రైనర్లకు వాంకిడి ఎఫ్ఎస్‌వో భగవంత్ రావు చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో రజిత, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ

తాండూర్, జూలై 26 : తాండూర్ మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎంపీడీవో శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి కిరణ్మయితో కలిసి మండల ప్రత్యేకాధికారి గజానంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీడ్, ఫర్టిలైజర్, పెస్టిసైడ్ స్టాక్, రిజిస్టర్లు, బిల్ పుస్తకాలు, లైసెన్స్‌లను, అలాగే ఈ-పాస్ మిషన్‌లో ఫర్టిలైజర్ స్టాక్‌ను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అమ్మాలని, ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు, ఫెస్టిసైడ్స్ కొన్న రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని తెలిపారు. తాండూర్ కేజీబీవీని ఎంపీడీవోతో కలిసి ప్రత్యేకాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్లు, మెనూ, తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఇన్‌చార్జి ఎస్వో సుమన చైతన్య, ఏఎన్ఎం ఊర్మిళ, పీఈటీ సరళ, కార్యదర్శి సుధాకర్, వంశీ, సిబ్బంది ఉన్నారు.

ఆకస్మిక తనిఖీలు..

పలు జీపీల్లో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, ఎంపీవో అనిల్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కార్యదర్శులకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, కేజీబీవీ, పీహెచ్‌సీ సెంటర్, రాజీవ్ నగర్ జీపీలో నర్సరీ, తహసీల్ కార్యాలయంలోని ధరణి సహాయ కేంద్రం, ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన కరెక్షన్‌ను తనిఖీ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

మొక్కలను శ్రద్ధగా పెంచాలి

లక్షెట్టిపేట, జూలై 26 : గ్రామాల్లోని నర్సరీల్లో శ్రద్ధగా మొక్కలను పెంచాలని మంచిర్యాల డీపీవో వెంకటేశ్వర్‌రావు నిర్వాహకులను ఆదేశించారు. లక్ష్మీపూర్‌లోని నర్సరీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. నర్సరీలో షిఫ్టింగ్, గ్రేడింగ్ చేయాలని, ఖాళీగా ఉన్న బ్యాగుల్లో ఈత, వెదురు, నీలగిరి, ఖర్జూర విత్తనాలను నాటాలని సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పిల్లల ఎదుగుదల గురించి టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో కలిసి డ్రైడే నిర్వహించారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీఎం వెంకటరమణ, మం డల పంచాయతీ అధికారి బుగ్గారం శ్రీనివాస్, కార్యదర్శి సునీత, పాఠశాల సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

కాగజ్‌నగర్, జూలై 26 : కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ తీశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, విశ్రాంత ఆర్మీ యూనియన్ నాయకుడు శివ ఆధ్వర్యంలో స్థానిక పెట్రోల్ పంపు ఏరియాలో ప్రారంభమై, ఎన్‌టీఆర్, లారీ, రాజీవ్ గాంధీ, అంబేద్కర్ చౌరస్తాల మీదుగా కొనసాగింది. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్, జూలై 26 : మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సొసైటీ జిల్లా జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, కమిటీ సభ్యులు పవన్ కుమార్ తివారి, కాటుకం హరీశ్, రక్త నిధి కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్, జూలై 26 : కాగజ్‌నగర్‌లోని సీనియర్ సిటిజన్స్ ఆఫీసులో అమరవీరుల సంస్కరణ సభ నిర్వహించారు. అమరవీరుల ఫొటోలకు పూలమాలు వేసి, నివాళులర్పించారు. ఎన్‌సీసీ ఫోర్స్ రిటైర్డ్ ఎంప్లాయి ఆకుల నాగేశ్వర్ రావును సన్మానించారు. రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, ఏఎస్ఆర్ మూర్తి, యెల్లా గౌడ్, రమణయ్య, నాగేశ్వర్ రావు, కోటేశ్వర్‌రావు, చిలుక లక్ష్మీనారాయణ, ప్రతాప్ సింగ్, ఎం రాంబాబు, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

ఐచర్ వ్యాన్ పట్టివేత

రెబ్బెన, జూలై 26 : ఎలాంటి అనుమతులు లేకుండా ఎడ్లు, బర్రెలు తరలిస్తున్న ఐచర్ వ్యాన్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కౌటల వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఐచర్ వ్యాన్‌ను పట్టుకున్నారు. అందులో 15 ఎడ్లు, 8 బర్రెలు తరలిస్తుండగా, పట్టుకున్నట్లు, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

శ్రీరాంపూర్, జూలై 26 : శ్రీరాంపూర్ కాలనీ బస్టాండ్ వద్ద శుక్రవారం ఎస్ఐ సంతోష్ ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. వాహనాలను తనిఖీ చేసి, నంబర్ ప్లేట్లు లేనివాటిని పట్టుకున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదని సూచించారు.

యువకుడి ఆత్మహత్య

జైపూర్, జూలై 26 : జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామరావుపేట పంచాయతీ పరిధి దుబ్బపల్లి గ్రామానికి చెందిన జాడి హరీశ్ (28) అప్పుల బాధ భరించలేక శుక్రవారం ఉరేసుకున్నాడని ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. హరీశ్ ఏడాది క్రితం ఫైనాన్స్‌లో ట్రాక్టర్ కొని, వివిధ పనులు చేసుకుంటుండేవాడు. ఇటీవల గిరాకీ లేకపోవడం, ఫైనాన్స్ ఒత్తిడి తట్టుకోలేకవడం, చెల్లెలి పెళ్లి కోసం తెచ్చిన అప్పు చెల్లించలేక మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి బొంద్యాలు ఫిర్యాదు మేరకు కేసు న